ఉత్సవ వేళ.. కోలాట హేల

జానపదులతో పెనవేసుకున్న ఆ నృత్యం ఇప్పుడు నగరాలనూ పలకరిస్తోంది. పాటకు తగినట్లుగా పదం కలుపుతూ.. ఉత్సాహంగా సాగే ఆ నర్తనం ప్రతీ మదిని తాకుతోంది. దేవదేవుని తిరువీధి ఉత్సవంలో స్వాగత గీతం పలుకుతోంది. సంప్రదాయ ఒరవడిని కొనసాగిస్తూ.. పిల్లలను, పెద్దలను అలరిస్తూ కళావైభవాన్ని చాటుతోంది.

- ఆలయాల్లో ఆకట్టుకుంటున్న కోలాట ప్రదర్శనలు
- పరసల్లో ప్రత్యేక ఆకర్షణ
- ఔత్సాహికులకు ఉచిత శిక్షణ



గణేష్ హనుమాన్ కొత్తమాంబ భజనమండలి కోలాట బృందం



ప్రాక్టీస్ చేస్తున్న హరిహర భజన బృందం



ఆలయంలో కోలాటమాడుతున్న శ్రీశక్తి భజన బృందం

పెదగంట్యాడ: ఉగాది మొదలుకొని సంక్రాంతి వరకు .. వేడుక ఏదైనా, సంబరం ఎక్కడైనా కోలాట బృందాలు సందడి చేస్తున్నాయి. లయబద్ధమైన ప్రదర్శనలతో అలరిస్తున్నాయి. ఆలయాల్లోని ప్రతీ వేడుకలో పదం కలిపేలా ఉత్సాహాన్ని నింపుతున్నాయి. పెద్దలతో పాటు చిన్నారులు సైతం ఈ కోలాటంపై ఆసక్తి పెంచుకోవడం విశేషం. జానపద కళారూపాల్లో ఒకటైన ఈ కోలాటం జానపదుల జీవితాలతో పెనవేసుకుపోయింది. ఒకప్పుడు పల్లెలకే పరిమితమైన ఈ కళ ఇప్పుడు నగరాల్లోనూ విస్తరిస్తోంది. ఈ కళను ప్రచారం చేయడంలో మహిళా లోకం ముందుంటోంది. సరదా కోసం కాదు.. భగవంతుని సేవ కోసమేనంటూ.. భక్తిభావాన్ని పెంపొందిస్తూ వడివడిగా సాగుతోంది.

మువ్వల సవ్వడి.. కోలాట సందడి

వీనుల విందుగా మువ్వల సవ్వడి .. కనులపండువగా కోలాట సందడి వేడుకలకు అదనపు ఆకర్షణగా నిలుస్తోంది. కాలికి గజ్జెలు కట్టి, లయబద్ధమైన అడుగులతో .. చేతిలో కర్రలతో ఆడుతూ సాగే ఈ కోలాటానికి ఇప్పుడు పెదగంట్యాడ మండలంలో విశేష ఆదరణ లభిస్తోంది. ఒక్కో ప్రాంతంలో ఒక్కో ఆలయం వద్ద కొంతమంది మహిళలు బృందంగా ఏర్పడి ఆలయాల్లో సాయంత్రం సమయాల్లో కోలాటాన్ని నేర్చుకుంటున్నారు. బృందంలోని సభ్యులందరూ ఒకే రకమైన వస్త్రధారణలో అన్నమయ్య కీర్తనలు, భక్తి పాటలకు అనుగుణంగా కోలాటమాడుతూ.. పాదాలు కదుపుతూ ఆకట్టుకుంటున్నారు.

ఉచిత శిక్షణ

ఆలయాల వద్ద మహిళలు కోలాటంలో ఉచిత శిక్షణ ఇస్తున్నారు. నడుపూరు వాసవీ జ్ఞాన మందిరంలో, చిన నడుపూరులోని వంశీకృష్ణ ఆలయంలో, వుడా కాలనీ, గోపాలరెడ్డినగర్, సీతానగరం, నెల్లిముక్కు తదితర ప్రాంతాల్లో ఈ శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ శిక్షణ తీసుకున్న వారు కోలాటంలో ప్రావీణ్యం గడించిన అనంతరం, మరికొందరికి ఈ విద్యను నేర్పిస్తూ ప్రోత్సహించడం విశేషం.

భక్తి భావాన్ని పెంపొందించేందుకు..



మా బృందం ద్వారా అనేక ఆలయాల్లో కోలాటాన్ని ప్రదర్శిస్తూ వస్తున్నాం. ప్రజల్లో భక్తి భావాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నాం. కోలాటం ప్రాచీన కళ. దీనిపై ఆసక్తి పెంచి, వైభవం తేవాలని ఆకాంక్షిస్తున్నాం.

– వరలక్ష్మి, హరి హర భజన బృందం

ఆరోగ్యం.. ఆనందం



నృత్యం ఏదైనా మానసిక ప్రశాంతత, శారీరక ఆరోగ్యం లభిస్తాయి. కోలాటం కూడా అంతే. రోజూ కోలాటమాడితే చక్కని వ్యాయామంగా ఉపయోగపడుతోంది. నిత్యం సాధన చేస్తే ఎంతో ఉత్సాహంగా అనిపిస్తుంది. భగవంతుడికి చేసే ఈ సేవ మాకు ఎంతో ఆనందాన్నిస్తోంది.

– పద్మలత, హరిహర భజన బృందం

మా వంతు సేవ చేయాలని..



మా బృందంలోని సభ్యులతో పాటు కొత్తగా వచ్చిన వారికి, ఆసక్తి గల వారికి శిక్షణ ఇస్తున్నాం. కోలాటం ద్వారా సంప్రదాయ కళకు మా వంతు సేవ చేయాలనేదే తపన. చిన్నారులకు కూడా శిక్షణ ఇస్తున్నాం. ఎవరైనా సంప్రదించవచ్చు.

– వాణీ జయరాం, శ్రీశక్తి భజన బృందం

విస్తృత ప్రచారమే లక్ష్యం



కోలాటాన్ని సరదాగా నేర్చుకున్నాను.. పెదగంట్యాడతో పాటు పెద్ద పెద్ద ఆలయాల్లో, ఇతర ప్రదేశాల్లోనూ ప్రదర్శనలు ఇస్తున్నాను. నేను నేర్చుకున్న పదిమందికీ ఉపయోగపడితే అంతకంటే ఆనందం ఏముంటుంది. అందుకే విస్తృతంగా ప్రచారం చేస్తున్నాను.

– శ్వేత విజయ, శ్రీశక్తి భజన బృందం

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో పాల్గొన్న పలువురు ఉభయదాతలు

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

19న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 19న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించాలని ఆమె పేర్కొన్నారు.

21న అప్పన్న తెప్పోత్సవం

సింహాచలం: పుష్య బహుళ అమావాస్యని పురస్కరించుకుని సింహాచల శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామివారి తెప్పోత్సవం(నౌకా విహారం) ఈ నెల 21న జరగనుంది. ఆ రోజు సాయంత్రం కొండ దిగువ వరాహ పుష్కరిణిలో స్వామివారు శ్రీకృష్ణాలంకారంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా నౌకావిహారంతో కనువిందు చేయనున్నాడు. తెప్పోత్సవం సందర్భంగా దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో విశేషంగా ఏర్పాట్లు చేస్తున్నారు. స్వామివారు విహరించే తెప్పని వరాహ పుష్కరిణి వద్ద ఇంజినీరింగ్ అధికారులు సిద్ధం చేస్తున్నారు. తెప్పోత్సవానికి వరాహ పుష్కరిణి వద్ద జరుగుతున్న ఏర్పాట్లను దేవస్థానం ట్రస్ట్‌బోర్డు సభ్యుడు గంట్ల శ్రీనుబాబు మంగళవారం పరిశీలించారు.

క్లుప్తంగా

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు



విజేతలతో కార్పొరేటర్ గోవింద రెడ్డి

అక్కిరెడ్డిపాలెం: ముగ్గుల పోటీల విజేతలకు 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి మంగళవారం బహుమతులు ప్రదానం చేశారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని గోవింద రెడ్డి తండ్రి కుంచారావు జ్ఞాపకార్థం తుంగ్లాంలోని రామాలయం ఈ పోటీలను నిర్వహించారు. 250 మంది మహిళలు పోటీల్లో పాల్గొన్నారు. పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు బహుమతులతో పాటు 247 మందికి బహుమతులు అందజేసినట్లు గోవింద రెడ్డి తెలిపారు.

ఆలయ అభివృద్ధికి రూ.50వేల విరాళం



ఆలయ కమిటీ ప్రతినిధులకు నగదు అందజేస్తున్న కార్పొరేటర్ వంశీరెడ్డి

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు దుర్గవానిపాలెంలోని గౌరీ పరమేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి రూ.50వేలు విరాళంగా ఇచ్చారు. మంగళవారం ఆలయాన్ని సందర్శించిన ఆయన, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గంట్యాడ గురుమూర్తి, తిప్పల అప్పలస్వామి, మార్టుపూడి పరదేశి, గంట్యాడ పైడిరాజు, సత్యం తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత ప్రచారకుడు రంగనాథం కన్నుమూత



డాక్టర్ రంగనాథం (ఫైల్)

అల్లిపురం : గత 50 సంవత్సరాలుగా భగవద్గీతను వివిధ మార్గాల్లో ప్రచారం చేస్తూ ఎందరికో స్ఫూర్తి కలిగించిన డాక్టర్ వీవీ రంగనాథం (82) మంగళవారం వారి స్వగృహమందు భగవత్ సన్నిధికి చేరారని వారి కుటుంబ సభ్యులు తెలిపారు. ఆయన ఏవీఎన్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్‌గా పని చేసి, పదవీ విరమణ చేశారు. వీరు రచించిన సచిత్ర గీతామృతము (బొమ్మలతో భగవద్గీత) చాలా ప్రాముఖ్యత సంతరించుకుంది. గీతా ప్రచార సమితి వివిధ హోదాల్లో చేశారు. పూర్ణానంద సమాజానికి గౌరవాధ్యక్షులుగా, గీతా సేవా ట్రస్ట్ అధ్యక్షుడిగా ప్రస్తుతం కొనసాగుతున్నారని పేర్కొన్నారు. రంగనాథం మృతికి నగరంలోని ప్రముఖులు సంతాపం తెలిపారు.

చురుగ్గా ఫీవర్ సర్వే



నీటి నిల్వలను పరిశీలిస్తున్న వైద్య సిబ్బంది

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేటలో 7 ఏళ్ల అమ్మాయి డెంగ్యూ జ్వరం బారిన పడింది. దీంతో జీవీఎంసీ, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది అప్రమత్తపై మంగళవారం వ్యాధిగ్రస్తురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వ్యాధికి గురైన బాలిక ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. బాధితురాలి ఇంటి చుట్టు పక్కల ఫీవర్ సర్వే నిర్వహించారు. ఎవరైనా జ్వరంతో బాధపడుతున్నారా? డెంగ్యూ కారక దోమలు ఎక్కడైనా పెరుగుతున్నాయా అని నీటి నిల్వలు తనిఖీ చేశారు. నీటిలో దోమ లార్వాలు గుర్తించి.. నీటిని పారబోశారు. దోమలు వృద్ధి చెందకుండా, జ్వరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానికులకు అవగాహన కల్పించారు. హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరెడ్డి, హెల్త్ సెక్రటరీ అప్పలనరస, వలంటీర్లు, యాంటీ మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా పెంటమాంబ పరస



అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే నాగిరెడ్డి



పరసలో సందర్శకుల సందడి

పెదగంట్యాడ: గ్రామదేవతల పండగలు సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. మండలంలోని నెల్లిముక్కు గ్రామంలో కొలువుదీరిన పెంటమాంబ అమ్మవారి పరసను మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, పూజల అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటాలు, సాముగరిడీలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి మాట్లాడుతూ గ్రామాలను చల్లగా చూసే గ్రామదేవతల పండగలను ఏటేటా చేయడం అభినందనీయమన్నారు. అమ్మవారిని నెల్లిముక్కు గ్రామస్తులతో మండలంలోని పెద గంట్యాడ, సీతానగరం, హౌసింగ్ బోర్డ్ కాలనీ, నడుపూరు, బర్మా కాలనీ, డెయిరీ కాలనీ, అయ్యన్నపాలెం తదితర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో పులి వెంకట రమణారెడ్డి, గొందేశి సత్యారావు, గొందేశి వెంకట రమణారెడ్డి, గొందేశి అప్పలరెడ్డి, పులి రాజారెడ్డి, గొందేశి సుమన్, నెల్లి అప్పలరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని పులి భూలోకరెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు.



అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మహిళల కోలాటం

బోసిపోయిన గాజువాక

- రోడ్లపై కనిపించని జనం
- కార్యాలయాలూ వెలవెల



60 అడుగుల రోడ్డులో కనిపించని జనసంచారం



బోసిపోయిన గాజువాక మెయిన్ రోడ్



వెలవెలబోయిన జీవీఎంసీ జోనల్ కార్యాలయ ప్రాంగణం

గాజువాక : జనంతో కిక్కిరిసిపోయి, నిత్యం రద్దీగా కనిపించే గాజువాక మంగళవారం కూడా బోసిపోయింది. సంక్రాంతికి ఊరెళ్లినవారు ఇంకా పూర్తిస్థాయిలో తిరిగి ఇక్కడికి చేరుకోకపోవడం, పండగ కారణంగా జనం రోడ్లపైకి రాకపోవడంతో గాజువాక జాతీయ రహదారి సహా మెయిన్‌రోడ్, రాజీవ్‌మార్గ్ రోడ్, కణితి రోడ్, 60 అడుగుల రోడ్ వంటి బిజీ ప్రాంతాలు కూడా నిర్మానుష్యంగా కనిపించాయి. జనం సంచారం లేకపోవడంతో కొన్ని దుకాణాలను కూడా వ్యాపారులు తెరవలేదు.

కార్యాలయాలదీ ఇదే పరిస్థితి

జనం లేక ప్రభుత్వ కార్యాలయాలు సైతం వెలవెలబోయాయి. ఇక్కడి జీవీఎంసీ గాజువాక జోనల్ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయాలు అర్జీదారులతో నిత్యం రద్దీగా ఉండేవి. ఇప్పుడు జనం రాకపోవడంతో అవీ ఖాళీగా దర్శనమిచ్చాయి. కొంతమంది అధికారులు, సిబ్బంది కూడా వ్యక్తిగత సెలవులు పెట్టుకోవడంతో, ఆయా విభాగాల్లోనూ సందడి కనిపించలేదు.

‘ఉక్కు’ సెగ ఢిల్లీని తాకేలా..

- 30న ప్రజా గర్జన
- ఉక్కు పోరాట కమిటీ నాయకులు వెల్లడి
- 705వ రోజుకు రిలే దీక్షలు



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు కర్మాగారంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ, ఢిల్లీకి సెగ తాకేలా ఈ నెల 30న ఉక్కు ప్రజాగర్జన నిర్వహించనున్నామని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు తెలిపారు. కార్మికుల ఐక్య ఉద్యమాలతో కేంద్రప్రభుత్వం దిగి రావాల్సిందేనన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 705వ రోజు మంగళవారం సంస్థలోని డబ్ల్యూ.ఆర్.ఎం–1 మరియు 2 విభాగాల కార్మికులు పాల్గొన్నారు. కార్మికులను ఉద్దేశించి పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, ఎస్.రామారావు, జె.రామకృష్ణ, వరసాల శ్రీనివాసరావు, పరంధామయ్య, చిత్రాడ సన్యాసిరావు, కె.శ్రీనివాసనాయుడు, గుమ్మడి నరేంద్ర, బి.డేవిడ్ తదితరులు ప్రసంగించారు. కార్మికులు చేస్తున్న ఉద్యమాన్ని కేంద్రప్రభుత్వం అణచివేయలేదన్నారు. రాష్ట్ర అభివృద్ధికి విశాఖ ఉక్కు చాలా ముఖ్యమని, దీనిని ప్రైవేటీకరణ చేస్తే ప్రజలందరూ నష్టపోతారని తెలిపారు. లక్షల మందికి అన్నం పెడుతున్న పరిశ్రమను అమ్మేయాలనుకోవడం అత్యంత దుర్మార్గమన్నారు. విశాఖ ఉక్కును ప్రభుత్వ రంగంలోనే కొనసాగిస్తామని కేంద్రప్రభుత్వం ప్రకటించే వరకు దీక్షలు కొనసాగిస్తామన్నారు. ఇప్పటికైనా, కేంద్రప్రభుత్వం కార్మికుల మనోభావాలకు విలువనిచ్చి ప్లాంట్ విషయంలో స్పష్టమైన హామీ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మురళి, బాషా, రాజు ఇతర కార్మికులు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ సంగమం

అర్ధ శతాబ్దం తరువాత కలుసుకున్న మిత్రబృందం



దశాబ్దాల నాటి స్నేహ బంధం.. స్మృతుల పరిమళాలు వెదజల్లింది. అపూర్వ సంగమ వేళ పాత మిత్రులను జ్ఞాపకాల దొంతరలు చుట్టుముట్టాయి. ఒకటా.. రెండా.. ఏకంగా 51 సంవత్సరాల అనంతరం కలసిన మిత్రబృందం ‘అపూర్వ’ కలయికకు వేదికైంది గాజువాకలోని ఓ ఫంక్షన్ హాల్. షిప్‌యార్డులోని గాంధీగ్రామ్ హైస్కూల్ 1970-71 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులంతా మంగళవారం కలుసుకున్నారు. అర్ధశతాబ్దపు తీపి గుర్తులను నెమరువేసుకున్నారు. ఆ రోజుల్లో తమకు చదువు చెప్పిన ఉపాధ్యాయులు రామకృష్ణ, నారాయణరావు, కృష్ణమూర్తి, చిట్టమ్మను ఘనంగా సత్కరించారు. డబ్ల్యూటీవో కామెంటేటర్ దేవరకొండ రవికాంత్ (జెనీవా), ఈఎన్‌టీ నిపుణుడు డాక్టర్ ఎస్.కె.ఇ.అప్పారావు ప్రత్యేక ఆహ్వానితులుగా విచ్చేసి తమ మిత్రులకు అభినందనలు తెలిపారు. పూర్వ విద్యార్థుల సంఘం కన్వీనర్ మాటూరి శ్రీనివాసరావు, కో-కన్వీనర్ కర్రి పద్మారావు, ప్రతినిధులు పీబీకే ఆనంద్, వెంకటేశ్వరరావు, మళ్ల అన్నపూర్ణ, కాండ్రేగుల త్రినాథ్, సముద్రం, తులసీరావు, ఆడారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. రోజంతా ముచ్చట్లతో గడిపిన వారంతా జ్ఞాపకాలను పదిలపరుచుకుని, మళ్లీ కలుసుకోవాలంటూ వీడ్కోలు పలికారు. - గాజువాక

జ్యోతిబసు జీవితం ఆదర్శనీయం



జ్యోతి బసుకు నివాళులు అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

పరవాడ: పశ్చిమబెంగాల్ మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత జ్యోతిబసు జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని సీఐటీయూ నాయకుడు గనిశెట్టి సత్యనారాయణ అన్నారు. సీఐటీయూ ఆధ్వర్యంలో జ్యోతిబసు 13వ వర్ధంతి కార్యక్రమాలు జేఎన్ ఫార్మాసిటీలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిబసు ఆశయ సాధనకు కార్మిక వర్గం కృషి చేయాలని పిలుపునిచ్చారు. రైల్వే కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. విప్లవోద్యమ నేతగా 33 ఏళ్లు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఆదర్శ పాలన అందించారని తెలిపారు. ప్రధానమంత్రి పదవిని కూడ పార్టీ ఆదేశాల మేరకు తిరస్కరించి తన వ్యక్తిత్వాన్ని చాటుకున్న గొప్ప వ్యక్తి అని కొనియాడారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కె.వెంకునాయుడు, పెంటారావు, కృష్ణ, అప్పారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడిలో ఆరుగురిపై కేసు

సబ్బవరం: మండలంలోని గొల్లలపాలెం గ్రామంలో ఒక వ్యక్తిపై సోమవారం రాత్రి కొంత మంది వివాదానికి దిగి దాడికి పాల్పడిన ఘటనలో ఆ వ్యక్తికి గాయాలయ్యాయి. దీంతో సబ్బవరం పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేయడంతో ఆరుగురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. బాధితుడు గొల్లవిల్లి ఈశ్వరరావు తెలిపిన వివరాలు.. గ్రామంలో సీతారాముల తీర్థం నిర్వహించేందుకు గొల్లవిల్లి ఈశ్వరరావు అధ్వర్యంలో గ్రామస్తులు సమావేశం అయ్యారు. సమావేశంలో తీర్థం నిర్వహణ ఖర్చులపై చర్చ జరిగింది. సమావేశంలో పాల్గొన్న అదే గ్రామానికి చెందిన వద్దాది పైడిరాజు, శ్రీను, దేవుడమ్మ, సాలాపు తమ్మిరాము, కట్ట అప్పలరాజు, కోసిరెడ్డి సన్యాసమ్మలు పండగ చేయడానికి నువ్వెవడవంటూ మూకుమ్మడిగా దాడి చేసినట్టు బాధితుడు తెలిపాడు. పండగను వంగలపైడి సంతోష్ చేస్తారని, పండగ కార్యక్రమాల్లో నేను జోక్యం చేసుకోవడానికి వీల్లేదంటూ దాడికి దిగారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ దాడిలో ఈశ్వరరావుకు పలు చోట్ల గాయాలు కావడంతో 108 అంబులెన్స్‌లో అనకాపల్లి ప్రాంతీయ ఆస్పత్రికి తరలించి వైద్య సేవలు అందించారని తెలిపాడు. తనపై దాడికి పాల్పడిన ఆ ఆరుగురిపై విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ రంగనాథం ఈ సందర్భంగా వెల్లడించారు.

పోలీస్ వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

పరవాడ: యలమంచిలి–గాజువాక రహదారిలో రావాడ శివారు బొట్టవానిపాలెం వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. ఈ ప్రమాదంలో చినగంట్యాడకు చెందిన వై.తిరుపతిరావు(44)కు కాలు విరిగిపోయింది. స్థానికులు, పోలీసులు అందించిన వివరాలు.. చినగంట్యాడకు చెందిన వై.తిరుపతిరావు మంగళవారం తన ద్విచక్ర వాహనంపై స్వగ్రామం నుంచి అచ్యుతాపురం వెళుతున్నాడు. రావాడ శివారు బొట్టవానిపాలెం వద్దకు రాగానే ఎదురుగా వచ్చిన నావెల్ డాక్‌యార్డ్‌కు చెందిన పోలీసు వాహనం తిరుపతిరావును బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తిరుపతిరావు కాలు విరిగిపోయింది. తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం అగనంపూడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి పరవాడ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు